అకాల వర్షాలకు అన్నదాత విలవిల..!


నేలకూలిన అరటి చెట్లు

6
- బళ్లారి జిల్లాలో నేలకూలిన అరటి చెట్లు
- రూ.లక్షల్లో నష్టపోయాం.. ఆదుకోవాలంటున్న రైతులు

జలిలం..!

- మండుతున్న ఎండలు...
- వట్టిపోతున్న జలాశయాలు
- రాష్ట్రమంతటా తీవ్రమైన నీటి కరువు
- 16 జిల్లాల్లో ప్రజలు విలవిల
- ట్యాంకరు నీరు రూ.2వేలు పైమాటే..
- నగర సరిహద్దులోనూ అవే కష్టాలు


ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న నగరవాసులు


గొంతు తడవాలంటే కుటుంబమంతా బిందె పట్టాల్సిందే..

బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఉత్తరకన్నడ, బయలుసీమ జిల్లాల్లో వేడిమి తీవ్రస్థాయికి చేరింది. భూగర్భజలాలు అడుగంటడం, విద్యుత్‌కోతలు వెంటాడుతుండడంతో తాగునీటి సమస్య జటిలంగా మారింది. బిందెడు నీటి కోసం కుటుంబ సభ్యులంతా క్యూలో నిలబడి యుద్ధం చేయాల్సి వస్తోంది. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రముఖ జలాశయాలలో నీటిమట్టం తగ్గడం, భూగర్భజలాలు అడుగంటడంతో సమస్య ఏర్పడింది.రాజధాని బెంగళూరుతోపాటు దాదాపు అన్నిజిల్లాల్లోనూ తాగునీటి సమస్య రెండు మూడు వారాల్లో తీవ్రమైంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 జిల్లాల్లో వర్షం కొరత తీవ్రంగా మారింది. చెరువులు, కుంటలు, వాగులు, జలాశయాలలో నీరు లేక వెలవెలబోతున్నాయి. బయలుసీమ ప్రాంతాలే కాక సముద్రతీరం, మలెనాడు ప్రాంతాల్లోనూ నీటి కొరత తలెత్తింది. ఉత్తర కర్ణాటక ప్రాంతంలో బోరుబావులలో ఒక్కసారిగా జలమట్టం పడిపోయింది.



ట్యాంకరు రూ.2వేలుపైనే..

రాష్ట్రంలో వాటర్ ట్యాంకర్ల వ్యాపారం జోరందుకుంది. సాధారణంగా అవసరానికి ట్యాంకర్ల ద్వారా నీటిని సమకూర్చుకుంటారు. కానీ వేసవికాలంలో ప్రతిచోటా డిమాండ్ రావడంతో ట్యాంకరు యజమానులు మాఫియాగా మారిపోయారు. బెంగళూరులో గతంలో 6వేల లీటర్ల ట్యాంకరు రూ.600-800 ధర పలికేది. ప్రస్తుతం రూ.1300 నుంచి రూ.1800 దాకా పెరిగినట్టు తెలుస్తోంది. కొన్ని చోట్ల బిందెల చొప్పున నీటిని విక్రయిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ల వద్ద జనం క్యూ కడుతున్నారు. వాటర్ ప్లాంట్ల వద్దకు వెళ్తే కేవలం ఐదు నిమిషాలలోనే క్యాన్ వాటరు పట్టుకునే వెసలుబాటు ఉండేది. కానీ ఇటీవల కొన్ని రోజులుగా ఎక్కువ సమయం గడపాల్సి వస్తోంది. మరోవైపు కొన్ని ప్లాంట్లు మరమ్మత్తులకు గురయ్యాయి.

గతేడాది వర్షాలు కురిసినా..

గత ఏడాది సంతృప్తికరంగా వర్షాలు కురిశాయి. చెరువులు, కుంటలు, జలాశయాలకు నీరు పుష్కలంగా చేరింది. ఇక మార్చి రెండోవారం దాకా తాగునీటి సమస్య తీవ్రం అనిపించలేదు. ఇటీవల ఎండలు తారస్థాయికి చేరడంతో జలవనరులు తగ్గిపోయాయి. ఈ కారణంతోనే నీటి సమస్య నెలకొంది. ప్రభుత్వం నీటి వనరులను సమకూర్చుకుని ప్రజలకు తాగునీరు అందించేందుకు అత్యవసర చర్యలకు సిద్ధమైంది. జిల్లాధికారులు, జిల్లా పంచాయతీ సీఈఓలు గ్రామాలవారీగా తాగునీటి సమస్యలను పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు ఏమేర నీటి వనరులు ఉన్నాయనేది గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. ప్రైవేట్ బోరుబావులను లీజు లేదా అద్దెకు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

దాదాపు వెయ్యి గ్రామాల్లో తీవ్ర ఎద్దడి

రాష్ట్రంలోని 236 తాలూకాలపైకి 48 తాలూకాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ తాలూకాల పరిధిలో వెయ్యి గ్రామాల్లో సంపూర్ణంగా నీరులేని పరిస్థితి ఏర్పడింది. సదరు గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సమకూరుస్తున్నారు. కలబురగి, యాదగిరి, బాగల్కోటె, విజయనగర, మలెనాడు ప్రాంతాలైన చిక్కమంగళూరు, చామరాజనగర, కొడగు, తీరప్రాంత జిల్లాలు దక్షిణకన్నడ, ఉత్తరకన్నడతోపాటు బయలుసీమ జిల్లాలు రామనగర, చిక్కబళ్లాపుర, బెంగళూరు నగర పరిధిలో తాగునీటి సమస్య నెలకొంది. అత్యవసరమైన గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సమకూర్చే ప్రక్రియ కొనసాగుతున్నా అందరికీ నీరు చేరడం లేదు. మే నెలలో ఎండలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ పరిశోధనశాఖ అభిప్రాయపడుతోంది. దీన్నిబట్టి తాగునీటి సమస్య కూడా తీవ్రమయ్యే అవకాశాలు లేకపోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసరవంగా బోర్లు తవ్వేందుకు డిమాండ్ పెరుగుతోంది. ప్రజాప్రతినిధులకు గ్రామాలవారీగా ప్రజలు వెళ్లి నీటిని సమకూర్చాలని డిమాండ్ చేస్తున్నారు. బోరుబావులు తవ్వినా నీరు సాధ్యం కానుందా అనే అనుమానాలు ఉన్నాయి.

జిల్లాల వారీగా..

కోలారు జిల్లాలో 330కుపైగా గ్రామాలు, బాగల్కోటెలో 100, రాయచూరులో 70, బీదర్‌లో 60, యాదగిరి, విజయపుర, ఉత్తరకన్నడ, చిక్కబళ్ళాపుర, తుమకూరు, చిత్రదుర్గ, దావణగెరె, కలబురగి జిల్లాల్లో నీటి సమస్య పెరిగింది. శివమొగ్గలో 500 గ్రామాల్లో సమస్య నెలకొనవచ్చునని భావిస్తున్నారు. బోరుబావులకోసం డిమాండ్ పెరిగింది. మండ్య జిల్లాలో కేఆర్‌ఎస్ డ్యాం ఉన్నా దాదాపు 200 గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొనవచ్చునని అధికారులు భావిస్తున్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లాలో సుమారు 100 గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమైంది. ధారవాడ జిల్లాలో చెరువుల్లో నీరు ఉన్నా కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య నెలకొంది. బెళగావి జిల్లాలో ఏడు నదులున్నా నీటి ఎద్దడి తప్పడం లేదు. చిక్కోడి పరిధిలో 329, బెళగావి పరిధిలో 96 గ్రామాలలో తాగునీటి సమస్య ఉన్నట్టు గుర్తించారు. బెళగావికి హిడకల్ ప్రాజెక్టు నుంచి నీటిని సమకూరుస్తున్నారు.


ఎంత సేపయినా వేచి ఉండాల్సిందే..

అమెరికాలో ఆలోచన.. కొవిడ్ వేళ పూర్తి చేశా..!

- కల్పితాలు లేకుండా ఆత్మకథ రాశా
- ఏపీ సీఎం చంద్రబాబుకు అందజేశా
- పుస్తకాల సొమ్ముతో పేద పిల్లలకు విద్య : గల్లా అరుణకుమారి

బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తండ్రి వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చి పారిశ్రామికవేత్త భర్త గల్లా రామచంద్ర నాయుడుతో కలసి వ్యాపార వ్యవహారాల్లో కొనసాగానని ఆ తర్వాత రాజకీయాల్లో చోటు చేసుకున్న సంఘటనలతో దూరమై అమెరికాలో గడుపుతున్న వేళ ఆత్మచరిత్ర రాయాలని భావించానని అలా పుట్టిన ఆలోచన కొవిడ్ కాలంలో పూర్తి చేశానని గల్లా అరుణకుమారి తెలిపారు. ఆమె రచించిన స్వీయ చరిత్ర పుస్తకావిష్కరణ సభ ఆదివారం జయనగర్‌లోని ఏఎంసీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళిమోహన్, బెంగళూరు యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఆశాజ్యోతి, ప్రముఖ జర్నలిస్టు నామిని సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు. తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు కళారత్న రాధాకృష్ణరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆత్మచరిత్ర ఆలోచనను అరుణకుమారి వివరించారు. తాను పెద్ద రచయిత్రిని కానన్నారు. అమెరికాలో తెలుగు-వెలుగు పేరిట ముద్రణలేని వేళ చేతిరాతతో అభిప్రాయాలు రాసేవారమన్నారు. ఆ తర్వాత ఎంతోమంది వారి అనుభవాలను పంచుకున్నారన్నారు. వాటినే 13 కథలుగా రాశామన్నారు. బాల్యంలో ఆత్మకథలు చదవాలని తండ్రి ప్రోత్సహించేవారన్నారు. రాజకీయాల్లో విరామం వచ్చాక అమెరికా వెళ్లినప్పుడు కుమార్తె రమ ఆత్మకథ రాయాలని సూచించారన్నారు. కొంత సమయం ఆలోచించి కల్పితాలు రాయకూడదని మొదలెట్టి 300 పేజీలు ముగించానన్నారు. ఆ తర్వాత ఆరేళ్ల విరామం వచ్చిందన్నారు. కరోనా కాలంలో ఆ విరామాన్ని పూర్తి చేశానన్నారు. పుస్తకం బాగా వచ్చేందుకు ఎంతోమంది సహకరించానన్నారు. ఇప్పటికే పుస్తకాన్ని ఆవిష్కరించామన్నారు. బెంగళూరులో నివసించే తెలుగు ప్రజల అభిమానం మేరకు ఇక్కడ ఆవిష్కరిస్తున్నామన్నారు. పుస్తకాన్ని 900 రూపాయల చొప్పున విక్రయిస్తున్నామన్నారు. వచ్చిన సొమ్మంతా శ్రీకృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ట్రస్టు ద్వారా పేద పిల్లల విద్యకు కేటాయిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి పుస్తకం కొనుగోలు చేయాలని వివరిస్తే 900 రూపాయలా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేసి కంటెంట్ లేకుంటే డబ్బు వాపసు చేయాలని ఛలోక్తి విసిరారన్నారు. ఇప్పటిదాకా పుస్తకం విక్రయాలతో కోటి రూపాయల విరాళం ఇచ్చామన్నారు. రాధాకృష్ణరాజు మాట్లాడుతూ ఆత్మచరిత్ర రాయాలంటే చాలా ధైర్యం ఉండాలన్నారు. అరుణకుమారి అందుకు అర్హులని కొనియాడారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ గల్లా అరుణకుమారి రాజకీయ అనుభవం గొప్పదన్నారు. ఆమె పారిశ్రామికవేత్తగా సమాజసేవలోనూ ముఖ్యులుగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు పరమహంస, డాక్టర్ రమాదేవి, గరికపాటి రమేశ్, రెడ్డిప్రసాద్, సాకం నాగరాజు, రాజగోపాలనాయుడు, సురేశ్, కే మోహన్ నాయుడు, రుక్మాంగదనాయుడు, తేజస్వి, ఉమాకాంత్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు. ఇదే వేదిక ద్వారా గురజాల జగన్ 500 పుస్తకాలు కొనుగోలు చేస్తున్నట్టు ప్రకటించారు. వినోద్ రాజ్ 500, ఉమాకాంత్, చింతలపల్లి రజని 200, శ్రీహరి నాయుడు, ఆదికేశవులునాయుడు, మేదరమెట్ల మోహన్, పరంధామ నాయుడు, డాక్టర్ రెడ్డిప్రసాద్ తదితరులు వంద పుస్తకాల చొప్పున కొనుగోలు చేశారు.


పుస్తకావిష్కరణ వేదికపై గల్లా అరుణకుమారి తదితరులు

ఎమ్మెల్యేల సస్పెన్షన్.. సొంత నిర్ణయం కాదు

- మీడియాతో స్పీకర్ యూటీ ఖాదర్



బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ హోదాకు అవమానం చేసినందుకు బీజేపీకి చెందిన 18మంది ఎమ్మెల్యేల సస్పెన్షన్ రద్దు అంశం తన సొంత నిర్ణయం కాదని స్పీకర్ యూటీ ఖాదర్ అభిప్రాయపడ్డారు. మంగళూరులో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన నిబంధనలు అతిక్రమించినందుకే 18మంది ఎమ్మెల్యేలను ఆరు నెలలపాటు సస్పెండ్ చేశామన్నారు. ఎమ్మెల్యేల కమిటీలోనూ భాగస్వామ్యం వహించరాదని సూచించామన్నారు. వారి తప్పును వారు గుర్తించాలన్నారు. ఇది వారికి శిక్ష కాదని, భవిష్యత్తులో ఉత్తమ ఎమ్మెల్యేలుగా ఎదిగేందుకు కల్పించిన అవకాశం అన్నారు. సస్పెన్షన్ రద్దు విషయమై ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. బీజేపీ ఎమ్మెల్యే హరీశ్‌పూంజా వ్యాఖ్యలపై హక్కుల ఉల్లంఘనకు కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేసిన అంశంపై వివరణ ఇస్తూ కొందరు ఎమ్మెల్యేలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, ఇలా ప్రచారం లభిస్తుందని భావిస్తున్నారన్నారు. వారి వ్యాఖ్యలకు రాజ్యాంగబద్ధంగా కట్టుబడి ఉండాలన్నారు. హక్కుల ఉల్లంఘన కమిటీకి సిఫారసు చేస్తే వారు తీర్మానం చేస్తారన్నారు. రిటైర్డు డీజీపీ ఓం ప్రకాశ్ హత్య వెనుక పీఎఫ్ఐ హస్తం ఉందని మాజీ డీఎస్పీ అనుపమాషెణై లేఖపై స్పందిస్తూ తాను దర్యాప్తు ఏజెన్సీ సంస్థ కాదన్నారు. లేఖ వచ్చిందా లేదా పరిశీలిస్తానన్నారు.


కస్తూరిరంగన్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య

అశ్రునయనాల మధ్య కస్తూరిరంగన్‌కు వీడ్కోలు

- శాస్త్రవేత్తకు ప్రముఖుల నివాళి
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మాజీ చైర్మన్, పర్యావరణ నిపుణులు, విద్యావేత్త పద్మవిభూషణ్ కస్తూరిరంగన్‌కు అశ్రునయనాల మధ్య వీడ్కోలు పలికారు. శుక్రవారం కస్తూరిరంగన్ (84) తుదిశ్వాస వీడారు. ఆదివారం నగరంలోని రామన్ పరిశోధనా సంస్థ ప్రాంగణంలో ప్రజల సందర్శనకోసం ఆయన భౌతిక కాయాన్ని ఉంచారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల సమక్షంలో అంత్యక్రియలు జరిపారు. ఉదయం సీఎం సిద్దరామయ్య రామన్ పరిశోధనా సంస్థకు చేరుకుని పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళులు అర్పించారు. మంత్రి మహదేవప్పతోపాటు పలువురు నివాళులు అర్పించారు. బీజేపీ అగ్రనేత, మాజీ సీఎం యడియూరప్ప, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రలు కడపటి నివాళులు అర్పించారు. కస్తూరిరంగన్ పెద్దకుమారుడు రాజేశ్‌రంగన్, చిన్న కుమారుడు సంజయ్ రంగన్‌లను ఓదార్చారు. అధికారిక లాంఛనాలలో భాగంగా పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. అనంతరం జాతీయ పతాకాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. హిందూ సంప్రదాయపద్ధతిలో అంత్యక్రియలు ముగించారు.


నివాళి అర్పిస్తున్న మాజీ సీఎం యడియూరప్ప

అదిరన్..!

- ఉత్సాహంగా వరల్డ్ 10కే రన్
- ఉగాండా వాసులే విజేతలు..
- పురుషుల విజేత జోషు చెప్టగి..
- మహిళల విజేత సారా చెలంఘట్



ఉత్సాహంగా పరుగులు తీస్తున్న యువతి



చీర కట్టులో పరుగులు


పోటీలను ప్రారంభిస్తున్న గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్

నగరంలో ఏటా ప్రతిష్ఠాత్మకంగా జరిగే టీసీఎస్ వరల్డ్ 10కే పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం మాణెక్ షా పరేడ్ మైదానం వద్ద పోటీలను గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ జెండా ఊపి ప్రారంభించారు. 7


నటి శాన్వి →


వరల్డ్ 10కే విజేతలు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.29	1,578.44
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	442	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	327	67
నీటి నిల్వ (టీఎంసీలు)	6.87	3.76



కూలిపోయిన రాతి మండపం

కుప్పకూలిన రాతి మండపం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): హొసపేట కమలాపూర్‌లోని గాణగిత్తి జైన దేవాలయ ప్రాంగణంలో పురాత రాతి మండపం కుప్పకూలిపోయింది. శనివారం రాత్రి మండపం కూలిపోవడంతో పురావస్తు అధికారులపై చరిత్ర ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది విజయనగరం కాలం నాటి రాతి మండపం, చాలా రోజులుగా గాలి వర్షాల ప్రభావంతో కూలిపోయే దశలో ఉండేది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే కూలి పోయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. త్వరలో మరమ్మతులు చేపడ్తామని రాష్ట్ర పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ షెజేశ్వర్ తెలిపారు. హంపి, కమలాపూర్ చుట్టూ ఉన్న 57 ప్రధాన స్మారక చిహ్నాలు భారత కేంద్ర పురావస్తు సర్వే పరిధిలో ఉండగా, మిగిలిన వందలాది స్మారక చిహ్నాలు రాష్ట్ర పురావస్తు శాఖ పరిధి లోనే ఉన్నాయి.

మండుతున్న ఎండలు



నిర్మానుష్యంగా జిందాల్ ఓల్డ్ గేటు రోడ్డు

తోరణగల్లు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. జనం బయటికి రావాలంటేనే జడుసుకునే పరిస్థితి నెలకొంది. తోరణగల్లులో నిత్యం రద్దీగా ఉండే ఓల్డ్ స్టేషన్ గేటు, సండూర్ రహదారి జనం లేక వెలవెలబోతోంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతం ఎండల కారణంగా బోసిపోతోంది. సాయంత్రం నాలుగు గంటలైనా ఎండ వేడి తగ్గకపోవడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు.

రేపు ఐజీపీకి వీడ్కోలు



ఐజీపీ లోకేష్ కుమార్

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బళ్లారి సర్కిల్ ఐజీపీ బీఎస్ లోకేష్‌కుమార్ పదవీ విరమణ నేపథ్యంలో 29వ తేదీ మంగళవారం జిల్లా పంచాయతీ సభాంగణంలో వీడ్కోలు కార్యక్రమాన్ని జిల్లా పోలీసు విభాగం ఏర్పాటు చేసింది. అదేరోజు సాయంత్రం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఆయన పదవీ విరమణ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శోభారాణి అధ్యక్షత వహిస్తుండగా, అడిషనల్ ఐజీపీ కేపీ రవికుమార్, ఎస్.నవీన్ కుమాలతో పాటు అధికారులు సిబ్బంది పాల్గొంటున్నట్లు జిల్లా పోలీసు శాఖ అధికారులు ప్రకటనలో తెలిపారు.

అకాల వర్షాలకు అన్నదాత విలవిల..!



పాతదరోజీలో నేల కూలిన అరటి చెట్లు



నేలకూలిన విద్యుత్ స్తంభం



వేపచెట్టు

కంప్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు అన్నదాతకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. సండూర్ తాలూకా పరిధిలోని పాత దరోజి ప్రాంతంలో శనివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వర్షానికి అరటి పంట నేలకొరిగి తీవ్ర నష్టం మిగిల్చింది. మాదపురం గ్రామానికి వెళ్ళే మార్గంలో మరెమ్మ దేవస్థానం వద్ద పిడుగుపడి ఓ వేప చెట్టు, విద్యుత్ స్తంభం నేలకూలింది. ఈసందర్భంగా రైతులు బసరాజు, గురుమూర్తి, రాముడు, ప్రబాకర్ మాట్లాడుతూ వడగండ్ల వర్షానికి పాతదరోజీ పూర్తిగా నష్టపోయామన్నారు. రెవెన్యూ అధికారులు నష్టాన్ని పరిశీలించి పరిహారం అందజేయాలని కోరారు.

ఈదురుగాలులకు ఎగిరిపోయిన పాఠశాల పైకప్పు



ఎగిరిపోయిన ప్రభుత్వ పాఠశాల పైకప్పురేకు



ఇంటి పైకప్పుపై కూలిన చెట్టు

బళ్లారి సిటీ: విజయనగరం జిల్లా హగరిబొమ్మనహళ్ళిలో శనివారం సాయంత్రం ఈదురు గాలులు భారీగా వీచాయి. తాలూకాలోని వివిధ గ్రామాలను తాకిన భారీ గాలులు, వర్షం కారణంగా పింజార్ హెగ్డాల్ గ్రామానికి చెందిన బెలగుండి చంద్రప్ప ఇంటిపై ఓ చెట్టు కూలి ఇంటి పైకప్పు దెబ్బతింది. హంపాపట్టణ తాలూకాలోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల పైకప్పును కప్పి ఉంచిన పెద్ద షీట్ మెటల్ గాల్లోకి ఎగిరి పడిపోయింది. నీటి ట్యాంకులు కూడా ఎగిరిపోయాయి. ఉపనాయకనహళ్ళి సమీపంలోనికోళ్ల ఫారం పక్కన రాష్ట్ర రహదారిపై చెట్లు కూలిపోవడంతో చాలా సేపు రాకపోకలు నిలిచిపోయాయి. కేశవరాయన బండి రోడ్డులో చెట్టు కూలింది. నాగప్పకు చెందిన ఆవును పొలం కొట్టంలో కట్టి ఉంచారు. అవు పిడుగుపాటుకు గురై మృత్యువాత పడింది.

విద్యార్థులకు సులువుగా పాఠాలు నేర్పాలి

- ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో విద్యాశాఖ అధికారి గుర్రప్ప



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విద్యాశాఖ అధికారి గుర్రప్ప

సిరుగుప్ప, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధపడే విధంగా పాఠాలు నేర్పాలని విద్యాశాఖ అధికారి గుర్రప్ప సూచించారు. ఆదివారం సిరుగుప్ప పట్టణంలో గురుభవన్‌లో ఉపాధ్యాయులకు విద్యార్థులకు నేర్పే పాఠాల విషయంపై ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. మొక్కలకు నీరు పోసి గుర్రప్ప కార్యక్రమాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆదారపడిందని తెలిపారు. మానసిక విద్యార్థులకు చదువునేర్పించి వారిని ఉన్నతస్థాయికి తీసుకొచ్చే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, కేరళ ఉపాధ్యాయులు శిబిర కార్యక్రమంలో పాల్గొన్నారు. వీఆర్‌సీ అధికారి తమ్మనగౌడ పాటిల్, మేనేజర్ ప్రహ్లాద్ ,ఉపాధ్యాయులు చెంగారెడ్డి, సురేశ్ తదితరలు పాల్గొన్నారు.

నిఘా వైఫల్యంతోనే ఉగ్రదాడి: మాజీ ఎంపీ



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఉగ్రప్ప

రాయచూరు ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జమ్ము-కాశ్మీర్ రాష్ట్రం పహల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడి కేంద్ర ప్రభుత్వ నిఘా వైఫల్య కారణమేనని మాజీ ఎంపీ ఉగ్రప్ప ఆరోపించారు. సంఘటనలు జరిగిన అనంతరం రాజకీయ ప్రసంగాలు చేయడం తప్పా ముందస్తు బందోబస్తులు పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారుపాదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడిన ఉగ్రప్ప, ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత దుర్బరుడైన పాలకుడని ఎద్దేవా చేశారు. ఆయన హయాంలోని ఉరి, బాలకోట్, పుల్వామ వంటి వరుస సంఘటనలు జరిగినా ఇప్పటి కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం కాకపోవడం రక్షణ వైఫల్యమేనన్నారు. ఇందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉందన్నారు.

కలబురగిలో 9 మంది పాకిస్థానీలు

- దేశాన్ని విడిచి వెళ్లాల్సిందే..
- పోలీసు కమిషనర్ డాక్టర్ శరణప్ప



బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్ ఘటన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హై అలర్ట్ ప్రకటించాయి. దేశంలో అక్రమంగా నివాసం ఉంటున్న పాక్ దేశస్తులను తిరిగి వెళ్ళిపోవాలని సూచించిన నేపథ్యంలో....రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో అక్రమంగా నివాసం ఉన్న పాక్ దేశస్తులను వెతికే ప్రయత్నం ఆయా జిల్లా పోలీసు విభాగం చేబడుతోంది. ఇందులో భాగంగానే కలబురగి నగరంలో ఇప్పటి 9మంది పాక్ దేశస్తులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలని సూచించినట్లు కలబురగి జిల్లా పోలీసు కమిషనర్ డాక్టర్ శరణప్ప మీడియాకు వివరించారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ఉన్న 9మంది పాకిస్తాన్ దేశస్తుల్లో ఇద్దరు దీర్ఘకాలిక వీసా పొందిన వారు కాగా, మిగిలిన 7 మంది విజిటర్స్ వీసా కలిగి ఉన్నారని, వీరు గత 20 ఏళ్ళుగా గుల్బర్గాలో నివాసం ఉన్నట్లు తెలిపారు. అందరినీ నియమానుసారంగా తిరిగి వారి దేశానికి వెళ్ళిపోవాలని సూచించినట్లు తెలిపారు. విజిటర్స్ వీసా పొందిన ఏడుగురిలో ఇద్దరు మహిళలు అనుమతి పొంది అమెరికాకు బయలు దేరారని, మిగిలిన ఆరుగురిలో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నట్లు తెలిపారు. ఫారిన్ రీజనల్ రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసుకున్న పాక్ ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆయా జిల్లాల జిల్లాధికారులకు, జిల్లా పోలీసులకు సమాచారం పంపిందని తెలిపారు. వారి ఆదేశాల ప్రకారం ఆయా జిల్లాలో ఉన్న నివాసం ఉన్న పాక్ ప్రజలను భారత దేశాన్ని వెంటనే వదిలి వెళ్ళాలని సూచించినట్లు వివరించారు. ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓలో నమోదు చేసుకోకుండా, అక్రమంగా నివాసం ఉంటున్నవారిని స్థానిక పోలీసులు గుర్తించి అరెస్టు చేసి జైలుకు తరలించిన అనంతరం సమాచారాన్ని కేంద్ర హోంశాఖ సమాచారం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ కనికా సిక్రివాల్, ఇతర పోలీసు అధికారు పాల్గొన్నారు.



గొర్రెలను పంపిణీ చేస్తున్న జేఎస్‌డబ్ల్యూ అధికారులు

జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో గొర్రెల పంపిణీ

బళ్లారి సిటీ,ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సండూర్ తాలూకాలోని తోరణగల్లు ఓపీజే సెంటర్‌లో జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం హగరి సహకారంతో రైతులకు ఉచితంగా గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సునీల్ రాల్ఫ్ మాట్లాడుతూ రైతులు ఆదాయం సంపాదించడానికి , వ్యవసాయ భూమికి మంచి ఎరువులు అందించడానిక గొర్రెల పెంపకం ఉత్తమ వృత్తి అన్నారు. సమగ్ర వ్యవసాయంలో భాగంగా జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ 50 మంది రైతులకు గొర్రెలు అందించామన్నారు. ఇప్పటి వరకు మేము 25 మంది రైతులకు కోళ్లను పంపిణీ చేశామన్నారు. ఇప్పుడు ప్రయోగాత్మకంగా మొత్తం 5కుటుంబాలకు 25గొర్రెలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో సండూర్ ప్రాంతంలో సమగ్ర వ్యసాయం కోసం 200మందికి పైగా రైతులకు ప్రోత్సహకాలను అందిస్తామన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం హగరి అధిపతి డాక్టర్ గోవిందప్ప మాట్లాడుతూ రైతులకు కెంగురి జాతి గొర్రెలను అందించాము. ఇవి స్థానికంగా స్థానిక వాతావరణానికి అనుగుణంగా పెరుగుతా యన్నారు. ఈసందర్భంగా జేఎస్ డబ్ల్యూ ఫౌండేషన్ వ్యవసాయశాఖ సమన్వయకర్త నాగనగౌడ, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర రవి, డాక్టర్ రమేష్, రైతులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పేదలకు అందాల్సిన బియ్యం బ్లాక్ మార్కెట్ తరలుతున్న ఘటనలు నిత్యం వెలుగు చూస్తున్నాయి. జిల్లా ఆహార పౌరసరఫరా శాఖ అక్రమ బియ్యం రవాణాపై ఇప్పటికే కొరడా ఝులింపించినా... అధికారులు, పోలీసులు కళ్ళుగప్పి పేదల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు చేరుతునే ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి మోకా స్టేషన్ పరిధిలోని మోకా, ఎర్రగుడి ప్రాంతాల నుంచి సేకరించిన బియ్యాన్ని బొలెరో వాహనంలో కురుగోడు వైపు తరలిస్తుండగా జాలిబెంచి గ్రామం వద్ద మోకా పోలీసులు పట్టుకున్నారు. విషయాన్ని పోలీసులు జిల్లా ఆహార పౌరసరఫరా అధికారులకు చేరవేయడంతో... రాత్రికి రాత్రి ఘటనా స్థలానికి ఆహార పౌరసరఫరా అధికారి శరణప్ప, మరో ఇద్దరు అధికారులు చేరుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి వాహన డ్రైవర్, కూలీలు వాహనాన్ని అక్కడే వదిలి వెళ్ళిపోయారు. ఈ వాహనంలో రూ.70వేలకు పైగా విలువ చేసే 50కిలోలు కలిగిన 64బియ్యం పాకెట్లు (సుమారు 32 క్వింటాళ్ళు)తో పాటు బొలెరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆహార పౌరసరఫరా అధికారుల ఫిర్యాదు మేరకు వాహనం యజమాని, ఇతరులపై మోకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఘటనా స్థలానికి మోకా పోలీసు స్టేషన్ క్రైమ్ పీఎస్ఐ నరసింహతో పాటు సిబ్బంది, ఆహార పౌరసరఫరా అధికారులు శరణయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాసిరకం పనులతో ఇబ్బందులు



నాణ్యత లేని డ్రైనేజీని చూపుతున్న స్థానికులు

కంప్లి,ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని కుడితిని పట్టణం 6వవార్డులో జరిగిన డ్రైనేజీ పనులు నాసిరకంగా ఉండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వార్డుకు చెందిన పార్వతి, లింగమ్మ, గంగమ్మ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే పనులు నాసిరకంగా పూర్తి చేశారన్నారు. రోడ్డుకు మధ్యలో ఎత్తైన డ్రైనేజీ నిర్మించడంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలలు తరబడి విజ్ఞప్తి చేస్తున్నా ప్రయోజనం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హులిగెమ్మ, హనుమక్క, లక్ష్మిచ నాగేంద్ర, హచ్చయ్య, సాదప్ప, చంద్ర సిద్దప్ప తదితరులున్నారు.

కారిగనూర్ ప్రజలకు ఆస్పత్రి కరువు



సౌకర్యాలు లేని వైద్యశిబిరం

బళ్లారి సిటీ,ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): హొసపేట నగరం చుట్టుపక్కల ఉన్న 18 గనిప్రభావిత ప్రాంతాల్లో వైద్యశాల కరువయ్యింది. శిబిరాల్లో నివసిస్తున్న వీరికి మౌలిక సౌకర్యాలు కరువయ్యాయి. కారిగనూర్‌లో ప్రభుత్వ ఆసుపత్రి లేదు. అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటు గురించి అధికారులు , డీహెచ్‌ఓ చాలా సంవత్సరాలుగా మాట్లాడుతున్నారు. కానీ ఈవిషయంలో ఎటువంటి పురోగతి కనిపించలేదు. అనేక శిబిరాల్లో నెలకు ఒకసారి నిర్వహించే ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాలపై ఆధారపడాల్సిన వస్తోందని, కొన్నిసార్లు అదికూడా సరిగ్గా జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. తాగునీటి సౌకర్యం కూడా అందుబాటులో లేదు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆరోపిస్తున్నారు. అన్ని శిబిరాల ప్రజలు కేఎంఈఆర్‌సీ నుంచి వచ్చే గ్రాంట్లతో చేయగలిగే అభివృద్ధి పనుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన వైద్యకేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కళాశాలలో సమస్యలపై ఆరా

బళ్లారి రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంజయగాంధీ కళాశాలలో హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఉరుకుందరెడ్డి ప్రిన్సిపాల్ శ్యామ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉరుకుందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు. అనంతరం కళాశాలలోని గదులు, నీటి వ్యవస్థ, మరుగుదొడ్లను పరీక్షించారు. విద్యార్థులకు మౌలిక సౌకర్యాలకు లోటుకాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉమెన్‌రైట్స్ స్టేట్ జనరల్ సెక్రటరీ ఉప్పార మల్లప్ప, రేణుక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హ్యూమన్‌రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఉరుకుందరెడ్డి

హోసూరు జోన్



కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందినవారికి సంతాపంగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేఎస్ నరేంద్రన్, జిల్లా అధ్యక్షులు నారాయణన్ పాల్గొన్నారు. (హోసూరు రూరల్, ఆంధ్రజ్యోతి)

టైటాన్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం

హోసూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ముదుగానపల్లి ప్రభుత్వ పశువైద్యకేంద్రం, టైటాన్ ఇంజనీరింగ్ అండ్ ఆటోమేషన్ సంస్థ సంయుక్తంగా ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ పశువైద్యుడు విద్యావతి నేతృత్వంలో డాక్టర్ మునియప్ప తదితరులు పాల్గొని పశువులకు పరీక్షలు చేశారు. 500కుపైగా పశులుకు పరీక్షలు చేశారు. జ్వరం, అజీర్ణం, శ్వాసకోశ వాపు, ఇతర వ్యాధులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డీల్ సంస్థ సీఎస్ఆర్ విభాగం నిర్వాహకులు, రామదాస్, సురేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



చికిత్స అందిస్తున్న వైద్యులు



పతకాలతో విద్యార్థులు

కరాటేతో ఆత్మరక్షణ

- కోచ్ లోకనాథన్
- 150 మందికి పతకాలు

హోసూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కరాటేను ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని కరాటే కోచ్ లోకనాథన్ అభిప్రాయపడ్డారు. కరాటే సహా పలు రకాల మార్షల్ ఆర్ట్స్ అనేవి ఆత్మరక్షణకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఇటీవల కాలంలో ఆకతాయిల వేధింపులు అధికమయ్యాయని, అనుకోని ఘటనలను ఎదుర్కొనాల్సి వస్తే కరాటే వంటి ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చునన్నారు. కరాటే ప్రదర్శనలకు సంబంధించి 150మందికిపైగా పాల్గొనగా ప్రతిభావంతులను మెడల్స్ ప్రశంసాపత్రాలతో అభినందించారు. శాంతిసంపత్, బీఎస్ఎన్ఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మామన్ సభ్యుడు ఇందిరా, వెంకటేశన్, కరాటే స్కూల్ నిర్వాహకుడు లోకనాథన్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారు దొరికింది..

- సీసీ కెమెరాల సాయంతో 4 గంటల్లోనే గుర్తించిన పోలీసులు

రాయచూరు ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నగరంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు తమ పనితనాన్ని చాటాయి. బంగారు ఆభరణాలను పోగొట్టుకున్న మహిళను నాలుగు గంటల్లోగా వాటిని తిరిగి ఇప్పించడంలో పోలీసులు విజయం సాధించారు. లక్ష్మి కిరణ్ కుర్మ అనే కరాటే ఉపాధ్యాయురాలు ఆదివారం తాలూకాలోని శక్తినగర్ నుంచి జిల్లా కేంద్రం రాయచూరుకు బస్సులో వచ్చి స్థానిక సెంట్రల్ బస్‌స్టాండ్ నుంచి ఆటోలో సదర్ బజార్‌లోని జ్యువెలరీ షాప్‌కు వెళ్లారు. షాప్‌లో వెళ్లిన అనంతరం తన వ్యానిటీ బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయినట్లు గుర్తించిన మహిళ కంగారుగా సమీపంలో ఉన్న సదర్ బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సీసీ కెమెరా ఆధారంగా ఆమె ప్రయాణించిన ఆటో నెంబర్‌ను బట్టి ఆ ఆటో యజమాని స్థానిక ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి వెంటనే అక్కడికి వెళ్లారు. ఆటోలోనే వ్యానిటీ బ్యాగ్ మరిచిపోయినట్లు గుర్తించిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య ఆధ్వర్యంలో మహిళకు తిరిగి ఇచ్చేశారు. ఆ వ్యానిటీ బ్యాగ్‌లో ఉన్న బంగారు ఆభరణాల విలువ రూ.1.95 లక్షలకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. వాటిని బాధిత మహిళకు అందచేసిన పోలీసులు ఆభరణాలు,విలువైన వస్తువులు వెంట తెచ్చుకునే సమయంలో జాగ్రతగా ఉండాలని సూచించారు. కాగా ఈ సందర్భంగా మాట్లాడిన డీఎస్పీ సీసీ కెమెరాల వల్ల ఎలాంటి నేరాలనైన అదుపు చేసే అవకాశం ఉంటుందని నిందితులను గుర్తించడంలో కీలకంగా పని చేస్తాయని సూచించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

కాళ్లకూరి నారాయణరావు (జయంతి)



బహుముఖ ప్రజ్ఞాశాలి కాళ్లకూరి నారాయణరావు 1871 ఏప్రిల్ 28న పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరము మండలం మత్స్యపురి గ్రామంలో జన్మించారు. నాటకకర్త, సంఘ సంస్కర్త, ప్రథమాంధ్ర ప్రచురణకర్త, జాతీయవాది, ఛాయాగ్రహణ విద్యాధురంధరుడు, మహాకవి బిరుదాంకితుడు. చింతామణి, వరవిక్రయం, మధుసేవ వంటి నాటకాలు ఎంతో పేరొందాయి. ఇతర రచనలు సంసార నటన, కారణం లేని కంగారు, దసరా తమాషాలు, లుబ్ధగ్రేసర చక్రవర్తి, రూపాయి గమ్మత్తు, ఘోరకలి వంటి రచనలు ఆదరణ పొందాయి. ఇవి తెలుగు సినిమాలుగా కూడా ప్రదర్శించబడి విజయం సాధించాయి. 1927 జూన్ 27న కన్నుమూశారు.

భమిడిపాటి కామేశ్వరరావు (జయంతి)



'హాస్యబ్రహ్మ'గా పేరొందిన భమిడిపాటి కామేశ్వరరావు 1897 ఏప్రిల్ 28న పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో జన్మించారు. రచయిత, నటుడు, నాటక కర్త. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ చాలా నాటకాలు, నాటికలు, కథలు రచించారు. సమకాలీన సాంఘిక సమస్యలను హాస్యరసానురంజకంగా మలచిన ప్రజ్ఞాశాలి. త్యాగరాజు రచనలను జీవితాన్ని చక్కగా పరిశీలించి రాగ, తాళ వాద్యాలను ఆ గాయకుడి భావానికి అనుగుణంగా సమకూర్చి వివరిస్తూ 'త్యాగరాజు ఆత్మ విచారం' అనే రచన చేశారు. తన జీవితంలో జరిగిన విశేషాలు, సంఘటనలను జీవితచరిత్ర పుస్తకంలో వివరించారు. 1958 ఆగస్టు 28న పరమపదించారు.

భాను అథియా (జయంతి)




భాను అథియా 1929 ఏప్రిల్ 28న మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జన్మించారు. కాస్ట్యూమ్ డిజైనర్‌గా రాణించిన ఆమె దేశంలో తొలి ఆస్కార్ అవార్డును 1982లో 'గాంధీ' సినిమాకు అందుకున్నారు. వందకుపైగా సినిమాలకు పనిచేశారు. గురుదత్, యశ్‌చోప్రా, బీఆర్ చోప్రా, రాజ్‌కపూర్, విజయ్ ఆనంద్ వంటి ప్రముఖ దర్శకులతో కలసి ఐదు దశాబ్దాలపాటు పనిచేశారు. రెండు జాతీయ పురస్కారాలు ఇతర అవార్డులు పొందారు. 2020 అక్టోబరు 15న కన్నుమూశారు.

ఏజీ కృష్ణమూర్తి (జయంతి)



అచ్యుతాని గోపాల (ఏజీ) కృష్ణమూర్తి 1942 ఏప్రిల్ 28న గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. దేశంలో పేరొందిన ముద్రా కమ్యూనికేషన్స్ సంస్థ సంస్థాపకులు, ఛైర్మన్. ప్రకటనల రంగంలో దేశంలోనే పేరొందిన సంస్థగా అభివృద్ధి చేశారు. పదవీ విరమణ తర్వాత కాలమిస్టుగా, రచయితగా ఆంగ్లంలోనూ, తెలుగులోనూ పలు వ్యాసాలు, పుస్తకాలు ప్రచురించారు. ఆయన పుస్తకాలు ఇతర భారతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. 2016 ఫిబ్రవరి 5న కన్నుమూశారు.

ఖదీర్‌బాబు (పుట్టినరోజు)



తెలుగు చిన్నకథల రచయితగా గుర్తింపు పొందిన మొహమ్మద్ ఖదీర్ బాబు 1972 ఏప్రిల్ 28న నెల్లూరు జిల్లా కావలిలో జన్మించారు. పాత్రికేయుడిగా, తెలుగు సినిమా స్క్రిప్ట్ రైటర్‌గా రాణించారు. స్థానిక యాసకు అనుగుణంగా, సంప్రదాయాలకు అద్దంపట్టేలా కథలు ఉండడం ప్రత్యేకత. దర్గామిట్టకథలు, పోలేరమ్మ బండ కథలు, న్యూ బాంబే టైలర్స్, పప్పుజాన్ కథలు, బియాండ్ కాఫీ వంటి రచనలు ఎంతో పేరొందాయి. ఓనమాలు, బ్రహ్మోత్సవం, మనమంతా తదితర సినిమాలకు డైలాగ్ రైటర్‌గా గుర్తింపు పొందారు.

కార్పొరేట్ రంగంలో నాయకత్వ లక్షణాలకు అవకాశాలు

బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు కార్పొరేట్ రియల్ ఎస్టేట్, సౌలభ్యాల నిర్వహణలో వేగవంతమైన మార్పులకు సెంటర్ ఫర్ కమర్షియల్ రియల్ ఎస్టేట్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ (సీసీఐఆర్ఈ)ను పరిచయం చేస్తున్నారు. కార్పొరేట్ రియల్ ఎస్టేట్, సౌలభ్యాల నిర్వహణ అండ్ డేటా సైన్స్‌లపై పరిశోధన, తర్ఫీదుకోసం ఒకే వేదిక కల్పించేలా ఇది దోహదపడనుంది. తద్వారా పారిశ్రామిక రంగం, విద్యా పాలసీల రూపకర్తలను తీర్చిదిద్దేందుకు సీసీఐఆర్ఈ దోహదపడనుంది. కార్పొరేట్ రియల్ ఎస్టేట్ అండ్ సౌలభ్యాల నిర్వహణలో నిరంతరంగా ప్రగతిదశలో ఉన్న నేపథ్యంలో ఈ రంగంలో ప్రతిభావంతులకు మెరుగైన అవకాశాలు ఉన్నాయి.

వైభవంగా ప్రసన్న సోమేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం

ముళబాగిలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోమేశ్వరపాళ్యలో పురాణ ప్రసిద్ధ ప్రసన్న సోమేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, విశేషపుష్పాలంకరణ చేశారు. సంప్రదాయం ప్రకారం ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ నిర్వహించిన అనంతరం వేదపండితుల వేదఘోష నడుమ ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. తర్వాత అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. మహామంగళారతి ఇచ్చి ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్, తహసీల్దార్ వీ గీతా రథోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రథంపై అరటిపండు, దవనం, ఉప్పు సమర్పించి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తాదులకు పానకం, మజ్జిగ, పెసరపప్పు పంపిణీ చేశారు. పలు చోట్ల అన్న సంతర్పణ నిర్వహించారు. ఆలయ అర్చకులు ఏవీ రామనాథ దీక్షిత్ నేతృత్వంలో పూజాకైంకర్యాలు సాగాయి. రిటైర్డు ఐఏఎస్ అధికారి కృష్ణయ్య, దేవాదాయశాఖ అధికారి కేవీ సుబ్రమణ్యం, కేఎస్ అరవిందగౌడ, తాలూకా జేడీఎస్ ప్రధాన కార్యదర్శి రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్నేషనల్ ఎలైట్ ఉమెన్ విజేతలు



పరుగులో భాగంగా మహిళల బైక్ ర్యాలీ ఇలా...

అదిరన్..!

బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏటా ప్రతిష్ఠాత్మకంగా జరిగే టీసీఎస్ వరల్డ్ 10కే పోటీలలో మరోసారి ఆఫ్రికన్ దేశస్తులదే హవా సాగింది. ఆదివారం తెల్లవారుజామున మాణెక్ షా పరేడ్ మైదానం వద్ద పోటీలను గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ జెండా ఊపి ప్రారంభించారు. డీసీఎం డీకే శివకుమార్, హోం మంత్రి పరమేశ్వర్, అశ్విని పునీత్‌రాజ్‌కుమార్, ఎంపీ తేజస్వి సూర్య, ఎమ్మెల్యేలు రిజ్వాన్ అర్షద్, హారిస్, అశ్వత్థనారాయణ పాల్గొన్నారు. వివిధ రకాల పరుగు పోటీల్లో సుమారు 40వేలమంది భాగస్వాములయ్యారు. పురుషుల విభాగంలో ఉగాండా దేశానికి చెందిన జోషు చెప్టగి 27.53 నిమిషాలతో 10కిలోమీటర్లు పూర్తి చేసి విజేతగా నిలిచారు. రెండోస్థానంలో ఎరిట్రియాకు చెందిన టెస్ఫా జార్జెస్ 27.55 నిమిషాలలో పూర్తి చేశారు. మూడోస్థానంలో కెన్యాకు చెందిన విన్సెంట్ లాంగట్ 28.02 నిమిషాలలో పూర్తి చేశారు. ఆరు స్థానాలదాకా కెన్యా, టాంజానియా, ఇథియోపియా వాసులే నిలవగా ఏడోస్థానంలో భారత్‌కు చెందిన అభిషేక్‌పాల్ 29.12 నిమిషాలలో పూర్తి చేశారు. 11నుంచి వరుసగా 20 స్థానాలలో 9మంది ఇండియన్స్ రాణించారు. ఇండియన్ ఎలైట్ మెన్ విభాగంలో అభిషేక్ పాల్ 29.12 నిమిషాలలో 10 కిలోమీటర్లు పూర్తి చేసి విజేతగా నిలిచారు. రెండోస్థానంలో సావన్ బర్వాల్ 29.45 నిమిషాలలోనూ, కిరణ్‌మాత్రె 30.01 నిమిషాలలో పూర్తి చేశారు. ఇక మహిళల విభాగం ఇంటర్నేషనల్‌లో ఉగాండాకు చెందిన సారా చెలంఘట్ 31.07 నిమిషాలలో పూర్తి చేశారు. కెన్యాకు చెందిన సింటియా చెపాంజెన్ 32.04 నిమిషాలలో పూర్తి చేసి ద్వితీయస్థానంలో నిలిచారు. ఇథియోపియాకు చెందిన గుటేని శాంకో 32.06 నిమిషాలలో పూర్తి చేశారు. ఇండియాకు చెందిన సంజీవిని జాధవ్ 11వ స్థానంలోనూ, భారతి నైన్ 12వ స్థానంలో నిలవగా 14-20 స్థానాల్లో గెలుపొందారు. ఇండియన్ ఎలైట్ విభాగంలో సంజీవని జాధవ్, భారతి నైన్, పూనం సునసెలు నిలిచారు. మజారన్‌లో 25వేలమందికిపైగా భాగస్వాములయ్యారు. ప్రధానంగా సమాజానికి సందేశాలు ఇచ్చే ప్లకార్డులను ప్రదర్శించారు. పలు సంఘాలు, యోగాభ్యాసకులతోపాటు దివ్యాంగులు పోటీల్లో పాల్గొన్నారు. వివిధ విభాగాల విజేతలకు డీసీఎం డీకే శివకుమార్ బహుమతులు ప్రదానం చేశారు.



వృద్ధులు సైతం ఉత్సాహంగా..



పోటీల్లో దివ్యాంగులు సైతం

అసమానతలు రూపుమాపాలన్నదే అంబేడ్కర్ ఆశయం

బెంగళూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సమాజంలో అసమానత, అస్పృశ్యత రూపుమాపాలనేది అంబేడ్కర్ ఆశయంగా ఉండేదని మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఇ వెంకటయ్య అభిప్రాయపడ్డారు. బెంగళూరు తెలుగు పూర్వ విద్యార్థుల సంఘం ద్వారా ఆదివారం హలసూరులోని యాదవసంఘం భవనంలో అంబేడ్కర్ జయంతి జరిపారు. అటామిక్ సైంటిస్ట్ టీవీ తిరుపతి, సెంట్రల్ ఎక్సైజ్ మాజీ కమిషనర్ శ్రీధర్, కెనరాబ్యాంకు మాజీ డీజీఎం కేశవులుతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ సమాజంలో అస్పృశ్యత తొలగేవరకు సమానత్వం సాధ్యం కాదని అందుకు విద్య వజ్రాయుధం లాంటిదని అంబేడ్కర్ ఆశించారన్నారు. అందుకే రాజ్యాంగంలో రిజర్వేషన్ల ద్వారా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి మార్గదర్శకులయ్యారన్నారు. సభాధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్య, ఐక్యతకు అంబేడ్కర్ ఆశయాలను అందరూ పాటించాలన్నారు. టీవీ తిరుపతి మాట్లాడుతూ సమాజం మనకెన్నో ఇచ్చిందని మనం కూడా ఎంతోకొంత తిరిగి ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ ఆశయాలతోనే దేశంలో లక్షలాది మంది విద్య, రాజకీయ, ఉద్యోగ ఫలితాలు పొందారని వారు సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. పీ రాజేశ్, డేవిడ్ రాజు, వై దాసు, డీ తిరుపతయ్య, సుబ్రమణి, ఎం బాబు, బాలకృష్ణ, లక్ష్మణ, పోలయ్య తదితరులు పాల్గొన్నారు. శివాజినగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మన్సూర్ జయరాం, పెంచలరత్నం తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ వెంకటయ్యకు సంఘం సభ్యులు సత్కరించారు.



పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు

క్రికెట్‌కు అన్ని సీజన్లలోనూ క్రేజ్



క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో సారా టెండూల్కర్ తదితరులు

సారా టెండూల్కర్

బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): క్రికెట్‌కు అన్ని సీజన్లలోనూ క్రేజ్ ఎక్కువని ముంబై గ్రిజ్లీస్ జట్టు ఫ్రాంచైజీ సారా టెండూల్కర్ అభిప్రాయపడ్డారు. ఆదివారం నగరంలో జెట్ సింథసిస్ గ్లోబల్ ఈ-క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్2ను లాంఛనంగా ప్రారంభించారు. ఢిల్లీ షార్క్స్ ఫ్రాంచైజీగా లెన్స్‌కార్ట్ ఫౌండర్ సీఈఓ పియూష్‌బన్సాల్, బెంగళూరు బ్యాడ్జర్స్ ఫ్రాంచైజీగా జిరోదా అండ్ ట్రూ బీకన్ కో ఫౌండర్ నిఖిల్ కామత్, క్యూర్‌ఫుడ్స్ ఫౌండర్ అంకిత్‌నాగోరి, యాక్సెల్ ఇండియా ఫౌండర్ ప్రశాంత్ ప్రకాశ్‌లు ఉన్నారు. చెన్నై ఫాల్కన్స్ ఫ్రాంచైజీలుగా టీవీఎస్ కేపిటల్ ఫండ్స్ ఛైర్మన్ గోపాల్ శ్రీనివాసన్, యాప్ ఫౌండర్ మధుసూదన్, పారిశ్రామికవేత్త అర్జున్ సంతానకృష్ణన్‌లు ఉన్నారు. హైదరాబాద్ రైనోజ్‌కు ఎల్ఎన్‌బీ గ్రూప్ డైరెక్టర్ మెహతా ఫ్రాంచైజీ కాగా, పూనె స్టాలియన్స్‌కు నటుడు సునిల్‌శెట్టి పొందారు. జెట్ సింథసిస్ ఫౌండర్ సీఈఓ రాజన్ నవాని మాట్లాడుతూ జీఈపీఎల్‌లో వీడియోగేమింగ్, క్రీడా సంస్కృతి విస్తరించేందుకు వేదికలు నిర్మించేందుకు కట్టుబడ్డామన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహం

విజయనగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పాదరాయనపుర పరిధిలోని ఐపీడీ సాలప్ప లే అవుట్ వీఎస్ గార్డెన్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం లాంఛనంగా ఆవిష్కరించారు. మైసూరు మాజీ మేయర్, కర్ణాటక రాష్ట్ర పౌరకార్మిక మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ, బీబీఎంపీ డిప్యూటి కమిషనర్ (రెవెన్యూ) లక్ష్మీదేవి, బీబీఎంపీ అధికా రులు, ఉద్యోగుల ఐక్యతా మహాసభ అధ్యక్షులు అమృత్ రాజ్‌లు ప్రారంభించారు. అంబేడ్కర్ ఆశయాలతో ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. బెంగళూరు సెంట్రల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌతం, సమాజ సేవకుడు సీఆర్ రవి ప్రసాద్, రంజిత, గంగా భవాని దేవస్థాన అధ్యక్షుడు ఆర్ఎం ముత్యాలు అలియాస్ గుండప్ప, ఆంజనేయ, బీబీఎంపీ ఎంప్లాయీస్ సంఘం సభ్యుడ నరసింహమూర్తి, సుభాష్‌నగర్ మాజీ కార్పొరేటర్ మల్లేశ్, బీబీఎంపీ మేస్త్రీల సంఘం అధ్యక్షులు ముత్యాలు (డైరీ), తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పురస్కారంతో సత్కరించారు.

పహల్గాం మృతులకు నివాళి

బంగారపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందినవారికి పట్టణంలో నివాళులు అర్పించారు. పట్టణంలోని కువెంపు సర్కిల్‌లో ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడుల్లో మృతి చెందినవారికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదులను కట్టడి చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. కాంగ్రెస్ భవనం నుంచి కువెంపు సర్కిల్ వరకు దివిటీలతో ర్యాలీ సాగింది. మృతులకు సంతాపం తెలిపేలా కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేవీ నాగరాజ్, గోపాలగౌడ, చంద్రకుమార్, పురసభ అధ్యక్షుడు గోవింద, కుంబారపాళ్య మంజునాథ తదితరులు పాల్గొన్నారు.



దివిటీలతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

'ఆదివారం వ్యవసాయ దుకాణాలు తెరవాలి'

ముళబాగిలు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన ముళబాగిలు సహా గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పరికరాలు విక్రయించే దుకాణాలకు గత రెండేళ్లుగా ప్రతి ఆదివారం సెలవు కావడంతో రైతాంగంలో అసంతృప్తి నెలకొంది. దీంతో వ్యవసాయ పనులు జాప్యం అవుతున్నాయి. తాలూకాలో మొత్తం 90 వ్యవసాయ పరికరాల దుకాణాలు ఉన్నాయి. వ్యవసాయ పరికరాల విక్రయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సెలవురోజుగా ప్రకటించింది. దీంతో ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తన గింజలు కొనుగోళ్లకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల పిల్లలు కళాశాలల్లో చదివేవారు, బెంగళూరు ప్రైవేట్ కంపెనీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసేవారు ఆదివారం రోజున గ్రామాలకు వస్తుంటారు. అయితే వ్యవసాయ పరికరాల దుకాణాలు సెలవు కారణంగా మూసి వేయడంతో అవసరమైనవి లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సరిహద్దు దుకాణాలే శరణ్యం

కొంతమంది రైతులు తమ తోటలు, పొలాల్లో మందులు, ఇతరత్రా వస్తువులకోసం ఆదివారం వేళ స్థానికంగా సెలవు కారణంగా సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వీ కోట, పుంగనూరు, పలమనేరు, రామసముద్రం తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. తాలూకాలో టమోటా, బీన్స్, కోసు, కీరదోస, క్యాప్సికం సహా తదితర పంటలు పండిస్తున్నారు. ఆదివారం రోజుల్లో రైతులు కుటుంబంతో కలసి పొలం లేదా తోట పనుల్లో పాల్గొంటారు. అయితే స్థానికంగా దుకాణాలకు సెలవు కావడంతో అవసరమైన పరికరాలు లభించక ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు అనుకూలమయ్యేలా వ్యవసాయ పరికరాల దుకాణాల సంఘం తగిన చర్యలు తీసుకుంటుందని ఆదర్శరైతు పాలూరు రంగనాథ్ తదితరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తాలూకా వ్యవసాయ పరికరాల విక్రేత సంఘం అధ్యక్షుడు సురేశ్ స్పందిస్తూ జిల్లాసంఘం ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం దుకాణాలకు సెలవు ప్రకటించామన్నారు. తద్వారా ఒకరోజు విశ్రాంతి సాధ్యమన్నారు. వర్షాకాలంలో వచ్చే మూడు నెలల్లో ప్రతి ఆదివారం దుకాణం తెరిచేలా తీర్మానించామని త్వరలోనే అమలు చేస్తామన్నారు.

రోబోటిక్ శస్త్రచికిత్సల్లో మెడికవర్ రికార్డు

మహదేవపుర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రోబోటిక్ శస్త్రచికిత్సల్లో మెడికవర్ ఆసుపత్రి సరికొత్త రికార్డు నెలకొల్పిందని ఆసుపత్రి ముఖ్యులు కృష్ణమూర్తి తెలిపారు. వైట్‌ఫీల్డ్‌లోని ఆసుపత్రిలో మీడియాతో మాట్లాడుతూ 90రోజుల్లో 50 రోబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతం చేయడం ద్వారా సాంకేతికంగా మైలురాయి సాధించిందన్నారు. అంకెలకంటే రోగులకు మెరుగైన చికిత్స, విశ్రాంతి, వారిలో చిరునవ్వుకే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. డాక్టర్ కౌసిక్ సుబ్రమణియన్ మాట్లాడుతూ సాంకేతికత రోజురోజుకు అభివృద్ధి చెందుతోందన్నారు. రోబోటిక్ చికిత్సలో ఖచ్చితత్వంతోపాటు తక్కువ రక్తస్రావం, తక్కువ నొప్పి, త్వరగా కోలుకోవడానికి దోహదపడుతుందన్నారు. తద్వారా రోగి 3-4రోజుల్లోనే డిశ్చార్జ్ అవుతారన్నారు. మీడియా సమావేశంలో ఆసుపత్రి ప్రాంతీయ డైరెక్టర్ నీరజ్‌లాల్, డాక్టర్ ప్రమోద్ శివరామ్‌భట్, డాక్టర్ జక్కా సాయి మానసారెడ్డి, డాక్టర్ షకీల్ జావేద్ హుసేన్, శ్రుతికొప్పి, ప్రమోద్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు.. అంబేడ్కర్



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం

దొమ్మసంద్ర, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగనిర్మాత బీఆర్ అంబేడ్కర్ గొప్ప మానవతావాది అని ఆయన రూపొందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచిందని యువ నాయకుడు రాకేశ్ అభిప్రాయపడ్డారు. సర్జాపుర పట్టణంలోని అంబేడ్కర్ మైదానంలో అంబేడ్కర్ జయంతి, హరిత విప్లవ పితామహుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. రాకేశ్ మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ మంత్రిగా పేద రైతుల జీవితాల్లో వెలుగులు నింపారని, దేశానికి ఆహార భద్రత కల్పించారన్నారు. అంబేడ్కర్ ఆదర్శాలు, ఆలోచనలు భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాది వేశాయన్నారు. ఇదే సందర్భంగా ద్వితీయ పీయూ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినవారికి ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. కేపీసీసీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగవేణి తిమ్మరాయప్ప, అంబేడ్కర్ సేవారత్న ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జీ మునియప్ప, ప్రధాన కార్యదర్శి మూర్తికుమార్, సర్జాపుర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజేగౌడ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అణ్ణమ్మదేవి ఉత్సవం



పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు

బొమ్మనహళ్ళి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మైకో లే అవుట్ అణ్ణమ్మదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన గ్రామదేవత అణ్ణమ్మదేవి ఉత్సవం ఆదివారం ముగిసింది. శుక్ర, శని వారాలలో విశేషపూజలు నిర్వహించగా ఆదివారం పురవీధులలో ఊరేగించారు. ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అణ్ణమ్మదేవి ఉత్సవంతో ప్రత్యేకించి ఆరోగ్యదృష్ట్యా మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసంగా ఉందన్నారు. ఊరేగింపులో మూడు కళా బృందాలు పాల్గొన్నాయి. సుమారు పదివేలమందికి అన్న దానం నిర్వహించారు. కమిటీ సభ్యులు రమణ, యువరాజ్, కిరణ్ కుమార్, సుధాకర్ తదితరులు ఉత్సవాన్ని పర్యవేక్షించారు.

భూస్వాధీనానికి రైతుల అభిప్రాయ సేకరణ



మీడియాతో మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

శిడ్లఘట్ట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జంగమకోటె వద్ద పారిశ్రామికవాడ నిర్మించేందుకు 2,863 ఎకరాలను గుర్తించామని, భూస్వాధీనం కోసం రైతుల అభిప్రాయాన్ని సేకరిస్తున్నట్టు చిక్కబళ్ళాపుర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ వెల్లడించారు. శిడ్లఘట్ట తాలూకా జంగమకోటె హోబళి పరిధిలో కర్ణాటక పారిశ్రామిక ప్రదేశాభివృద్ధి మండలి ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన పథకాన్ని అమలు చేయడంలో తలెత్తిన సమస్యలను చర్చించేందుకు జంగమకోటెలోని జ్యోతి కళాశాల ఆవరణలో ఏర్పాటైన రైతులతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. జంగమకోటె హోబళి ప్రదేశంలో సుమారు 500కుపైగా ఎకరాలలో ప్రభుత్వ భూమి సహా 2,863 ఎకరాలలో పారిశ్రామిక ప్రదేశాన్ని అభివృద్ధి చేసేందుకు గుర్తించినట్టు తెలిపారు. బీఐఎల్ సమీపంలోని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే పెట్టుబడిదారులు ప్రాంతానికి వస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్దసంఖ్యలో ఉపాధి సాధ్యమన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి రైతులు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే రవికుమార్, కర్ణాటక పారిశ్రామిక ప్రదేశాభివృద్ధి మండలి ఈఓ మహేశ్, తహసీల్దార్ స్వామి, తాలూకా పంచాయతీ ఈఓ హేమావతి, రైతుసంఘం ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు పురస్కారాలు



కార్యక్రమంలో బీడీఏ అధ్యక్షుడు హ్యారిస్ తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రత్నాలు, ఆభరణాల రంగంలో మహిళా పారిశ్రామికవేత్తల పాత్ర కీలకమని బీడీఏ అధ్యక్షుడు ఎన్ఏ హ్యారిస్ అభిప్రాయపడ్డారు. నగరంలో ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో హీరా జవేరాత్ ట్రేడ్ మీడియా గ్రూప్ ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో ఐబీజేఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చేతన్‌కుమార్ మెహతా నేతృత్వంలో మూడో ఎడిషన్ గోల్డెన్ గర్ల్స్ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హ్యారిస్ మాట్లాడుతూ బెంగళూరు నగరంలో అంతర్జాతీయ స్థాయిలో నగలు, ఆభరణాల రంగంలోనూ తనదైన గుర్తింపు పొందిందన్నారు. ఈ రంగంలో రాణిస్తున్నవారిని తగిన రీతిలో గుర్తించి గౌరవించడం అభినందనీయమన్నారు. ఐబీజేఏ అధ్యక్షుడు పృథ్విరాజ్‌కొఠారి, రీనాశుక్లా, లక్ష్మీకామత్, బళ్ళారికి చెందిన పారిశ్రామికవేత్త భానుప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.